సాక్షి శ్రీకాకుళం

శనివారం । 20 । ఏప్రిల్ । 2024



అంతర్రాష్ట్ర ముఠా..

ఇంటర్‌సిటీ రైలులో అంతర్రాష్ట్ర దొంగలను పట్టుకున్నారు. దొంగ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

- 8లో



టీడీపీని వీడి..

టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారు. పాలనకు ఆకర్షితులమై పార్టీ తీర్థం పుచ్చుకుంటున్నారు.

- 8లో

రూ.1.37 లక్షలు నగదు పట్టివేత

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బెండి గేటు–వెంకటాపురం జంక్షన్ వద్ద శుక్రవారం ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా రూ. 1.37 లక్షలు పట్టుబడింది. వైజాగ్ నుంచి పలాస వైపు వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా కారులో ఈ నగదు పట్టుబడినట్లు తనిఖీ అధికారి వనిత తెలిపారు. సరైన ఆధారాలు చూపకపోవడంతో రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఈ నగదును సీజ్ చేసి శ్రీకాకుళం జిల్లా ట్రెజరీకి తరలించినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్



టెక్కలిలో నామినేషన్ పత్రాలను అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్



రణస్థలం ఆర్వో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తున్న కిరణ్ కుమార్

జగనన్న పిలుపే మా గెలుపు

- ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సీఎం వైఎస్ జగన్ పిలుపే తమ గెలుపని వైఎస్సార్ సీపీ శ్రీకాకుళం ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్ అన్నారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే తమను గెలిపిస్తాయన్నారు. నామినేషన్ వేశాక ఆయన శుక్రవారం కలెక్టరేట్ బయట మీడియాతో మాట్లాడారు. తన నామినేషన్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున వచ్చారని పేర్కొన్నారు. అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఐదేళ్ల జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాయని చెప్పారు. వారంతా వైఎస్సార్ సీపీతోనే ఉన్నారని తెలిపారు.

జిల్లాలో టీడీపీ కనుమరుగైందని, వారు ఏనాడూ జిల్లాకు మంచి చేయలేదని తెలిపారు. ఒక్క ప్రాజెక్టయినా ఏర్పాటు చేయలేదని, మౌలిక వసతులు సమకూర్చలేదని విమర్శించారు. వైఎస్సార్ హయాంలోనే వంశధార వంటి కీలక ప్రాజెక్టులు జిల్లాకు వచ్చాయని, ఇప్పుడు వైఎస్ జగన్ హయాంలో కిడ్నీ ఆస్పత్రి, పోర్టు, ఉద్దానం మంచినీటి ప్రాజెక్టులు వచ్చాయన్నారు. ఆమదాలవలస నియోజకవర్గం ఎడ్యుకేషనల్ హబ్‌గా మారిందన్నారు. అందుకే జనమంతా వైఎస్ జగన్‌మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని తెలిపారు. అందరి సహకారంతో అన్ని ఎమ్మెల్యే సీట్లతో పాటు ఎంపీ సీటును కూడా గెలుస్తామన్నారు.

'మామిడి' ర్యాలీలో అంబులెన్స్



కూటమి ర్యాలీలో చిక్కుకున్న అంబులెన్స్

పాతపట్నం: పాతపట్నంలో టీడీపీ అభ్యర్థి మామిడి గోవిందరావు నామినేషన్ సందర్భంగా శుక్రవారం పాతపట్నంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో అంబులెన్స్ చిక్కుకుపోయింది. మధ్యాహ్నం 12.30గంటల సమయంలో ట్రాఫిక్ జామ్ అవ్వడంతో గంటపాటు 108 అంబులెన్స్ ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయింది. సైరన్ మోగించినా ఎవరూ దారి ఇవ్వలేదు. అదే సమయంలో పాఠశాలలు విడిచిపెట్టడంతో ఆ దారంతా గందరగోళంగా మారింది.

పారదర్శకంగా వ్యయ పరిశీలన



సమావేశంలో మాట్లాడుతున్న వ్యయపరిశీలకులు కోమల్ జిత్ మీనా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల వ్యయ పరిశీలనను సంబంధిత అధికారులు అత్యంత పారదర్శకంగా చేపట్టాలని శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు కోమల్ జిత్ మీనా, శరవణ కుమార్‌లు సూచించారు. ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలతో కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో అధికారులు మాట్లాడారు. డబ్బు, మద్యం వంటి ప్రలోభాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, నిఘా కోసం ఏర్పాటు చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టీ బృందాలను కంట్రోల్ రూమ్ ద్వారా ఎల్లప్పుడూ పర్యవేక్షించాలని చెప్పారు. నిఘా బృందాలకు సీసీ కెమెరాలు, జీపీఎస్ ట్యాగ్ సిస్టం అమర్చిన విధానాన్ని అడిగారు. సీ-విజిల్, 1950 టోల్ ఫ్రీ ద్వారా వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రచార ఖర్చును అభ్యర్థుల ఎన్నికల ఖర్చుగా పరిగణిస్తూ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి రావు, నోడల్ అధికారులు సీపీఓ ప్రసన్న లక్ష్మి, జిల్లా ఆడిట్ అధికారి సుల్తానా, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్న కేశవరావు, డీపీఓ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, డీసీసీబీ సీఈఓ వరప్రసాద్, నీటిపారుదల శాఖ ఎస్ఈ పొన్నాడ సుధాకర్ తదితర అధికారులు హాజరయ్యారు.

నామినేషన్ వేసేందుకు కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి పేరాడ తిలక్, మంత్రి సీదిరి అప్పలరాజు, జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తదితరులు



సమరానికి సై

సార్వత్రిక సమరంలో కీలక ఘట్టం మొదలైంది. అభ్యర్థులు నామినేషన్ల జోరు పెంచారు. వైఎస్సార్‌సీపీ తరఫున శ్రీకాకుళం ఎంపీగా నామినేషన్ వేసిన పేరాడ తిలక్ భారీ ర్యాలీతో అందరి దృష్టిని తన వైపు తిప్పుకున్నారు. ఆ పార్టీ అగ్ర నాయకులంతా తోడుగా వచ్చి తిలక్ అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. అలాగే టెక్కలిలో దువ్వాడ శ్రీనివాస్ కనీవినీ ఎరుగని రీతిలో ర్యాలీ నిర్వహించి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేశారు. టీడీపీ, కాంగ్రెస్‌లతో పాటు ఇండిపెండెంట్లు కూడా తమ పత్రాలను దాఖలు చేశారు.



శ్రీకాకుళంలో వైఎస్సార్ సీపీ కార్యకర్త ఉత్సాహం



టెక్కలిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ నామినేషన్ ర్యాలీలో అభివాదం చేస్తున్న దువ్వాడ శ్రీనివాస్, పేరాడ తిలక్, కాయల వెంకటరెడ్డి తదితరులు

నామినేషన్ల పర్వం

రెండో రోజు 20

శ్రీకాకుళం పార్లమెంట్ స్థానం	4
అసెంబ్లీ స్థానాలు	
పలాస	4
టెక్కలి	2
పాతపట్నం	2
శ్రీకాకుళం	1
ఆమదాలవలస	4
ఎచ్చెర్ల	3
నరసన్నపేట	0
ఇచ్ఛాపురం	0

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శ్రీకాకుళం పార్లమెంట్ స్థానానికి రెండో రోజైన శుక్రవారం 4 నామినేషన్లు దాఖలయ్యాయి. అసెంబ్లీ స్థానాలకు 16 నామినేషన్లు దాఖలయ్యాయి.

పార్లమెంటు స్థానానికి..

శ్రీకాకుళం పార్లమెంటు నియోజకవర్గం స్థానానికి రెండో రోజు శుక్రవారం 4 నామినేషన్లు వచ్చాయి. ఈ పత్రాలను కలెక్టర్, పార్లమెంటు నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ స్వీకరించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పేరాడ తిలక్, స్వతంత్ర అభ్యర్థిగా పేరాడ భార్గవి, పిరమిడ్ పార్టీ అభ్యర్థిగా బొమ్మాళి తిరుపతిరావు, జై భారత్ పార్టీ అభ్యర్థిగా ఇప్పిలి సీతరాజులు నామినేషన్లు దాఖలు చేశారు.

అసెంబ్లీ స్థానాలకు..

- **టెక్కలి:** వైఎస్సార్‌సీపీ టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థిగా దువ్వాడ శ్రీనివాస్ శుక్రవారం తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. కోటబొమ్మాళి ఏఎంసీ వైస్ చైర్మన్ బొడ్డు వెంకటరమణ బలపరచగా ఒక సెట్ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ఈ నామినేషన్ దాఖలు ప్రక్రియలో దువ్వాడతో పాటు సంతబొమ్మాళి జెడ్పీటీసీ పాల వసంత్ రెడ్డి, ఎంపీపీ మేరుగు రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు యర్ర చక్రవర్తి ఉన్నారు. అంతకుముందు టెక్కలిలో భారీ ర్యాలీ నిర్వహించారు.
- **రణస్థలం:** ఎచ్చెర్ల నియోజకవర్గానికి వైఎస్సార్‌సీపీ తరఫున గొర్లె కిరణ్‌కుమార్ నామినేషన్ వేశారు. అలాగే ఆయన సతీమణి గొర్లె పరిమళ కూడా మరో సెట్ దాఖలు చేశారు. ఈ నెల 24న కిరణ్‌కుమార్ అట్టహాసంగా మరోసారి నామినేషన్ వేయనున్నారు. బీఎస్పీ తరఫున జి.రామారావు నామినేషన్ వేశారు.
- **ఆమదాలవలస:** ఆమదాలవలసలో టీడీపీ నుంచి కూన రవికుమార్ శుక్రవారం ఆమదాలవలసలో నామినేషన్ దాఖలు చేశారు. ఆయనతో పాటు ఆయన సతీమణి కూన ప్రమీల చెరో రెండు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎం.నవీన్‌కు సమర్పించారు.
- **పాతపట్నం:** టీడీపీ అభ్యర్థిగా మామిడి గోవిందరావు శుక్రవారం తన నామినేషన్ దాఖలు చేశారు. ఆయన భార్య సుదీష్ణ రెండో సెట్ దాఖలు చేశారు.
- **కాశీబుగ్గ:** పలాస శాసనసభ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా శుక్రవారం గౌతు శిరీష నామినేషన్ వేశారు. ఇక్కడే కాంగ్రెసు పార్టీ అభ్యర్థిగా మజ్జి తులసీదాసు తనయుడు మజ్జి త్రినాథ్ నామినేషన్ వేశారు. ఈయన రెండు నామినేషన్ సెట్లను ఎన్నికల అధికారికి అందజేశారు. అలాగే గౌతు శివాజీ కూడా ఒక నామినేషన్ పత్రాన్ని ఎన్నికల అధికారికి అందజేశారు.
- **టెక్కలి:** కాంగ్రెస్ పార్టీ టెక్కలి ఎమ్మెల్యే అభ్యర్థిగా కిల్లి కృపారాణి నామినేషన్ దాఖలు చేశారు.
- **శ్రీకాకుళం పాతబస్టాండ్:** శ్రీకాకుళంలోబీసీవై పార్టీ అభ్యర్థిగా సాలిన ప్రసాద్ నామినేషన్ వేశారు.

కూటమి గుండెల్లో రెబెల్స్

- టెక్కలిలో ఇప్పటికే స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన బీజేపీ నాయకుడు
- ఎచ్చెర్లలో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని ప్రకటించిన కాషాయ నేత
- పాతపట్నంలో 24న ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేస్తానని ప్రకటించిన కలమట



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:



టీడీపీ తరఫున కింజరాపు అచ్చెన్నాయుడు పోటీ చేస్తున్న టెక్కలి నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా బీజేపీకి చెందిన అట్టాడ రాజేష్ ఇప్పటికే నామినేషన్ వేశారు. బీజేపీ ఓబీసీ యువ మోర్చా జిల్లా అధ్యక్షునిగా, బీసీ వెల్ఫేర్ హాస్టల్స్ రాష్ట్ర కమిటీ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న రాజేష్ కూటమిని ధిక్కరించి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు.



జిల్లాలో బీజేపీ పోటీ చేస్తున్న ఏకైక నియోజకవర్గం ఎచ్చెర్ల. 30 ఏళ్లుగా బీజేపీలో కొనసాగుతూ జిల్లాలో సీనియర్ నాయకులుగా గుర్తింపు పొందిన సువ్వారి సన్యాసిరావు టిక్కెట్ ఆశించారు. కానీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మొండి చేయి చూపించి, తన సామాజిక వర్గానికి చెందిన నడుకుదిటి ఈశ్వరరావుకు టికెట్ ఇచ్చారు. దీంతో తీవ్ర అసంతృప్తికి లోనైన సన్యాసిరావు తన కోడలు రమ్యను ఇండిపెండెంట్‌గా పోటీ చేయించాలని నిర్ణయించారు. ఈనెల 23న నామినేషన్ వేయనున్నట్టు ప్రకటించారు.



పాతపట్నం టీడీపీ టికెట్ ఆశించి భంగపడ్డ మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నట్టుగా ప్రకటించారు. ఈనెల 24న నామినేషన్ వేస్తున్నట్టు వెల్లడించారు. తన నామినేషన్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరవ్వాలని శుక్రవారం ప్రెస్‌మీట్‌లో కోరారు.

పొలిటికల్ స్పాట్ లైట్

నామినేషన్ల పర్వం ప్రారంభం కావడమే తరువాయి టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. కూటమికి అసమ్మతి సెగతో పాటు రెబల్స్ పోటు తప్పడం లేదు. టికెట్ ఆశించి భంగపడ్డ టీడీపీ, బీజేపీ నాయకులు ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగి తమ సత్తా చూపాలని చూస్తున్నారు. ఏళ్ల తరబడి పార్టీకి పనిచేసి, ఎన్నికల్లో పోటీ చేసేందుకు కష్టపడితే ఎన్నికలొచ్చేసరికి డబ్బులిచ్చినోళ్లకి టికెట్ ఇచ్చి రోడ్డున పడేస్తే ఊరుకుంటామా అని ఇండిపెండెంట్లుగా బరిలోకి దిగుతున్నారు. ఇప్పటికే టెక్కలి నియోజకవర్గం నుంచి కూటమి అభ్యర్థిగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు బరిలో ఉన్నారు. త్వరలో నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈలోపే బీజేపీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు అట్టాడ రాజేష్ టీడీపీకి రెబల్‌గా స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. దీంతో రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు పోటీ చేసిన టెక్కలిలోనే పొత్తు వికటించింది. కూటమికి ఊహించని షాక్ తగిలింది.

ఎచ్చెర్లలో బీజేపీ అభ్యర్థికి బీజేపీ నాయకుడే షాకిచ్చారు. 30 ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తే... 2019ఎన్నికల తర్వాత పార్టీలోకి వచ్చి నాయకుడికి టికెట్ ఇవ్వడమేంటని బీజేపీ సీనియర్ నాయకులు సువ్వారి సన్యాసిరావు అడ్డం తిరిగారు. విధేయత, సీనియారిటీని చూడకుండా కేవలం డబ్బే పరమావధిగా నడికుదిటి ఈశ్వరరావుకు టికెట్ ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. రాష్ట్ర పార్టీ నాయకత్వంపై ప్రెస్‌మీట్లు పెట్టి మరీ ఆరోపణలు సైతం గుప్పించారు. అంతటితో ఆగకుండా ఏకంగా తన కోడలు రమ్యను బీజేపీకి రెబల్‌గా ఇండిపెండెంట్‌గా పోటీ లో పెడతానని శుక్రవారం ఎచ్చెర్లలో నిర్వహించిన ప్రజాగర్జనలో ప్రకటించారు. ఈనెల 23న నామి నేషన్ వేస్తున్నట్టు వెల్లడించారు. వీరికి ఆ పార్టీ సీనియర్ నాయకులంతా మద్దతు పలికారు. దీంతో కూటమిలోని మిగతా పక్షాలకు వణుకు మొదలైంది.

పాతపట్నంలో టీడీపీ అభ్యర్థిగా మామిడి గోవిందరావు నామినేషన్ వేసిన రోజునే అసమ్మతి నేత, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ బాంబు పేల్చారు. మామిడికి టికెట్ ఇవ్వడాన్ని తప్పు పడుతూ, బహిరంగంగానే ఆరోపణలు గుప్పించారు. టీడీపీకి రెబల్ గా నిలబడతానని చెప్పారు. అన్నట్టుగానే ఈనెల 24న నామినేషన్ వేయడానికి సిద్ధమయ్యారు. మూడు రోజులకే ఇంత మంది బయటకు వస్తే.. ముమ్ముందు ఇంకెంత మంది వస్తారోనని కూటమి నాయకులు భయపడుతున్నారు. వీరిని దారికి తెచ్చుకోవడానికి పడరాని పాట్లు పడుతున్నారు. కానీ, పరిస్థితులు అనుకూలించడం లేదు.

అట్టహాసంగా తిలక్ నామినేషన్

శ్రీకాకుళం పాతబస్టాండ్/ శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం ఎంపీ స్థానానికి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పేరాడ తిలక్ శుక్రవారం అట్టహాసంగా నామినేషన్ వేశారు. అంతకుముందు పార్టీ కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి, శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి మనజీర్ జిలానీ సమూన్‌కి తన నామినేషన్ల పత్రాలను అందజేశారు. ఆయన అభ్యర్థిత్వాన్ని స్పీకర్ తమ్మినేని సీతారాం, రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు, మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ బలపరిచారు. రెండో సెట్‌ను తిలక్ భార్య పేరాడ భార్గవి వేశారు. ఈ నామినేషన్‌ను జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఎమ్మెల్సీ నర్తు రామారావు, బుర్రా ఆదినారాయణ శాస్త్రి బలపరిచారు. నామినేషన్ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీతో శ్రీకాకుళం 80 అడుగుల రోడ్డు జనాలతో కిక్కిరిసిపోయింది. ముందుగా ఆనందమయి ఫంక్షన్ హాల్ వద్దకు పార్టీ శ్రేణులంతా చేరి అక్కడ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేశారు. కార్యక్రమానికి కార్పొరేషన్ చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, దుంపల లక్ష్మణరావు, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, డీసీ సీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ ఎంవీ పద్మావతి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంవీ స్వరూప్, కాయల వెంకటరెడ్డి, శిమ్మ రాజశేఖర్ తదితరులు హాజరయ్యారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న పేరాడ తిలక్, చిత్రంలో స్పీకర్ తమ్మినేని, మంత్రులు ధర్మాన, సీదిరి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్

పట్టాపగ్గాల్లేని ఆనందం

దశాబ్దాలుగా కొండపై ఎందరో గిరిపుత్రులు స్వేదం చిందిస్తున్నారు. అయినా కూలీలుగానే మిగిలిపోయారు. అనాదిగా ఆ భూమిలో వారే సేద్యం చేస్తున్నారు. అయినా రైతు అన్న గౌరవం పొందలేకపోయారు. ఆరుగాలం కష్టపడినా ఆపద వస్తే ఎలాంటి సాయం అందేది కాదు. దుక్కి దున్ని సాగు చేసినా ఏ హక్కూ ఉండేది కాదు. తరాలుగా సాగిన ఈ శ్రమ దోపిడీకి వైఎస్సార్ సీపీ సర్కారు తెర దించింది. పోడు భూములకు పట్టాలిచ్చి గిరిజన కుటుంబాలను భూ యజమానులుగా మార్చింది. ఈ ఒక్క సాయం వారి బతుకుల్లో వెలుగులు నింపింది.



నందిగాం మండలం సవర బడగాం గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన పోడు భూమిలో జీడి మామిడి మొక్కలు పెంచిన దృశ్యం

- గిరిపుత్రులకు రైతులుగా గౌరవం
- ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 26,931 ఎకరాలకు గాను 17,939 మంది గిరిజనులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాల పంపిణీ
- నాడు వైఎస్సార్.. నేడు వైఎస్ జగన్ సర్కారుల ఘనత
- పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజనులకు హక్కు పత్రాలు



టెక్కలి/మెళియాపుట్టి: తాతముత్తాతల నుంచి వ్యవసాయ కూలీలుగానే బతుకుతున్న గిరి పుత్రులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులుగా మార్చింది. కొండల్లో పోడు వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్న ఆదివాసీలకు అన్ని హక్కులు వచ్చేలా సాయం చేసింది. గడిచిన టీడీపీ ప్రభుత్వం గిరిజనులను పూర్తిగా విస్మరిస్తే.. వైఎస్సార్‌సీపీ పాలనలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో ఉమ్మడి జిల్లాలో సుమారు 26,931 ఎకరాలకు గాను 17,939 మంది గిరిజన రైతులకు ఆర్ఓఎఫ్ఆర్ (రిజర్వ్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్) పట్టాలను పంపిణీ చేశారు. 16 ఏళ్ల కిందట అప్పటి సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో పోడు పట్టాలను అందజేశారు. ఆ తర్వాత ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ఉమ్మడి జిల్లాలో గిరిజనులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను అందజేశారు.

మేలెంతో..

ప్రస్తుతం ఐటీడీఏ పరిధిలో 20 సబ్‌ప్లాన్ మండలాలు ఉన్నాయి. వీటి పరిధిలో 301 గ్రామ పంచాయతీలు,1,406 గ్రామాలున్నాయి. 2 లక్షల జనాభా నివసిస్తున్నారు. 40 వేలకుపైగా గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. వీరంతా పోడు వ్యవసాయంపై ఆధారపడి బతుకుతున్నారు. భూమిపై హక్కులు లేకపోవడంతో వీరికి ప్రభుత్వ సాయం అందేది కాదు. పంట పోతే బీమా కూడా వచ్చేది కాదు. ఇప్పుడు పట్టాలు రావడంతో వారికి రైతు భరోసా, రుణాలు తదితర సదుపాయాలు అందుతున్నాయి. పోడు వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి గతంలో సొంత డబ్బులు పెట్టుబడిగా పెట్టాల్సి ఉండేది. ఇప్పుడు ఉపాధి పథకం ద్వారా 150 రోజులు పనిదినాలు కల్పించారు.

జీడిమామిడి వేశారు..



చిత్రంలో కనిపిస్తున్న మహిళా రైతు పేరు సరవ అడివమ్మ. నందిగాం మండలం బడగాం పంచాయతీ సవర బడగాం గ్రామానికి చెందిన వారు. చాలా ఏళ్లుగా కొండపై పోడు వ్యవసాయం చేస్తున్నారు. కానీ ఎలాంటి పత్రాలు ఉండేవి కావు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చాక ఈమెకు ఒక ఎకరా భూమికి పోడు పట్టా మంజూరు చేయడంతో జీడి మామిడి తోట వేసుకున్నారు. సులభంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

20 ఏళ్ల నిరీక్షణకు ఫలితం



టెక్కలి మండలం లంకపాడు గ్రామానికి చెందిన సవర బంగారమ్మ గ్రామం సమీపంలో సుమారు 45 సెంట్లు పోడు వ్యవసాయం చేస్తున్నారు. సుమారు 20 ఏళ్లుగా అక్కడ సాగు చేస్తూ ఆమె ఆ భూమిపై ఎలాంటి హక్కు లేదు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక 2020లో ఈమెకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాను అందజేసి భూమికి యజమాని చేశారు. దీంతో ఆమె ఇప్పుడు ఎంతో ధైర్యంగా పోడు వ్యవసాయం చేసుకుంటున్నారు.



రుణం తీర్చుకుంటాం



మాది టెక్కలి మండలం లంకపాడు గ్రామం. గ్రామానికి సమీపంలో కొండ పై సుమారు 12 ఏళ్లుగా పోడు వ్యవసాయం చేస్తున్నాం. అయితే ఎప్పుడు ఏ అధికారి వచ్చి భూములను ఖాళీ చేయమంటారోనని ఎంతో భయాందోళనతో సాగు చేసేవాళ్లం. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మాకు పట్టాలు అందజేశారు. ఇలాంటి మేలు చేసిన వైఎస్ జగన్ రుణం తీర్చుకుంటాం.

– సవర గురుమూర్తి, లంకపాడు, టెక్కలి మండలం.

కుటుంబానికి భరోసా..



ఈమె పేరు గేదెల సీతమ్మ. నందిగాం మండలం అన్నాపురం పంచాయతీ సవర కొత్తూరు గ్రామానికి చెందిన ఈమె 15 ఏళ్లుగా కొండపై పోడు వ్యవసాయం చేస్తున్నారు. కానీ ఎలాంటి హక్కు లేకపోవడంతో బిక్కుబిక్కుమంటూ గడిపేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఈమెకు పోడు పట్టా అందింది. అప్పటి నుంచి ప్రభుత్వ రాయితీలు, పథకాలు వర్తిస్తున్నాయి. దీంతో ఈమె కుటుంబానికి భరోసా కలిగింది.



ప్రభుత్వం అందజేసిన పోడు పట్టా

గౌరవం వచ్చింది..



నాది గొట్టిపల్లి అనే గిరిజన గ్రామం. నేను కొండ పోడు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాను. తాతల నుంచి మేము సాగు చేస్తున్నా మాకు పట్టాలు ఎవరూ ఇవ్వలేదు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక నేను సాగు చేస్తున్న 1.50 ఎకరాల భూమికి పట్టాలు మంజూరు చేశారు. దీంతో నాకు ఒక ఆధారం దొరికింది. నాకు సొంత భూమి ఉందని సమాజంలో ఓ గౌరవం వచ్చింది. రైతు భరోసా కింద సాయం కూడా అందింది. పట్టాలపై బ్యాంకు రుణం కూడా తీసుకున్నాను. పట్టాలు ఇచ్చి మా బతుకుల్లో సీఎం వెలుగులు నింపారు.

– సవర మోహన రావు, గొట్టిపల్లి, కొత్తూరు మండలం

క్లుప్తంగా

ఆదిత్యున్ని దర్శించుకున్న హైకోర్టు జడ్జి



జస్టిస్ జ్యోతిర్మయికి జ్ఞాపిక అందజేస్తున్న ఈవో

అరసవల్లి: ప్రసిద్ధ సూర్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప్ కుటుంబసమేతంగా శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం ఈవో ఎస్.చంద్రశేఖర్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ విశిష్టతను వివరిస్తూ విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రొటోకాల్ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం



ర్యాలీ నిర్వహిస్తున్న కలెక్టర్ తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ పిలుపునిచ్చారు. శుక్రవారం శ్రీకాకుళంలోని ఏడు రోడ్ల కూడలిలో ఓటు హక్కు వినియోగంపై అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులతో కలిసి మానవహారం నిర్వహించారు. ఓటు హక్కు ప్రాముఖ్యతను వివరించారు.

కలెక్టర్‌ను కలిసిన వ్యయ పరిశీలకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా శ్రీకాకుళం పార్లమెంట్, ఇతర శాసన సభ నియోజకవర్గాలకు సంబంధించి పోటీలో ఉన్న అభ్యర్థులు చేసే ఖర్చులను లెక్కించేందుకు నియమితులైన వ్యయ పరిశీలకులు కోమల్‌జిత్ మీనా, శర్వన్ కుమార్‌లు శుక్రవారం జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

14 మందిపై కేసు నమోదు

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలో గురువారం జరిగిన కొట్లాట కేసుకు సంబంధించి ఇరువర్గాలకు చెందిన 14 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఒకవర్గంలో కొత్తకోట వేణుగోపాలరావు మరో తొమ్మిది మందిపై, మరో వర్గంలో కూన కిరణ్‌కుమార్ మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై చిరంజీవి తెలిపారు.

మట్టిపెళ్లలు పడి ఒడిశా యువకుడు మృతి



భర్త మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య గాయత్రి

ఇచ్ఛాపురం రూరల్: స్థానిక బాహుదానది వద్ద ప్రమాదవశాత్తు మట్టి పెళ్లలు పడి ఒడిశా యువకుడు మృతి చెందిన ఘటన ఇచ్ఛాపురం మండలంలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం జగదీశ్‌పూర్ ప్రాంతం కరియాగుడ గ్రామానికి చెందిన బాసుదేవ్ పాత్రో(32) బిర్లంగి గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం మహిళా కూలీని తీసుకొని స్థానిక బాహుదానది పరివాహక లోతట్టు ప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేస్తుండగా పైనుంచి మట్టి పెళ్లలు విరిగి బాసుదేవ్ పాత్రోపై పడటంతో ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయనకు ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య గాయత్రి పాత్రో ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ ఎస్.లక్ష్మణరావు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని శవ పంచనామా నిమిత్తం ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రికి తరలించారు.

32 మేకలు చోరీ

సారవకోట: మండలంలోని జమచక్రం పంచాయతీ రామచంద్రాపురం గ్రామంలో దండుపర్తి సింహాచలంకు చెందిన 32 మేకలు గురువారం రాత్రి దొంగలు ఎత్తుకుపోయారు. రామచంద్రాపురం పోలింగ్ కేంద్రంకు పక్కన ఖాళీ స్థలంలో ఉంచిన మేకలు తెల్లవారేసరికి లేకపోవడంతో శుక్రవారం సారవకోట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. జీవనాధారమైన మేకలు చోరీకి గురికావడంతో కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు.

పోస్టల్ బ్యాలెట్ తప్పులు సరిచేసుకోవాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది వారి ఓటుకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్‌లో తప్పులు ఉంటే సరిచేసుకోవాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎం.గణపతిరావు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ వేసుకునే అవకాశం కల్పించేందుకు జారీ చేసిన ఫారం 12ను పరిశీలించాలని, తప్పులు ఉంటే చేసుకుని సంబంధిత తహసీల్దార్‌కు ఎపిక్ కార్డు నకలుతో సహా అందించాలన్నారు. ఫారం-12 అందని వారు 21వ తేదీలోగా తహసీల్దార్ వద్ద నుంచి ఆ ఫారాన్ని తీసుకుని వివరాలు పూరించి ఎపిక్ కార్డు జిరాక్స్‌తో సహా ప్రస్తుతం పనిచేస్తున్న ప్రాంతంలోని తహసీల్దార్‌కు అందించాలన్నారు.

ప్రచార పర్వం



పూలవర్షం వజ్రపుకొత్తూరు: మంత్రి సీదిరి అప్పలరాజుపై పూలవర్షం కురిపిస్తున్న మంచినీళ్లపేట మత్స్యకార మహిళలు



విజయ దరహాసం సోంపేట: ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పిరియా విజయ



సంక్షేమం కొనసాగిద్దాం మెళియాపుట్టి: బందపల్లిలో సీఎం జగన్ అమలు చేసిన పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పోలింగ్ సమీపిస్తున్నందున అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నమవుతున్నారు. ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రజల్లోకి వెళ్తూ తమకే ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా ప్రచారాలతో హోరెత్తించారు.



భవితకు భరోసా జలుమూరు: వెంకటాపురంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న నరసన్నపేట ఎమ్మెల్యే కృష్ణదాస్



దివ్యాంగుడికి అండ ఎచ్చెర్ల క్యాంపస్: కొత్తపేటలో ఎన్నికల ప్రచారంలో భాగంగా దివ్యాంగుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్



ఆశీర్వదించండి బూర్జ: లచ్చయ్యపేటలో ఓటర్లకు అభివాదం తెలుపుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

అంతర్రాష్ట్ర దొంగల ముఠా పట్టివేత



పట్టుబడిన బీహార్ ముఠాతో ఎస్‌ఐ షరీఫ్, సిబ్బంది

కాశీబుగ్గ: భువనేశ్వర్–విశాఖపట్నం ఇంటర్‌సిటీ రైలులో బీహార్ రాష్ట్రానికి చెందిన ఐదుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులను జీఆర్పీ పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల తనిఖీల్లో భాగంగా పోలీసులు పలాస రైల్వే స్టేషన్‌లోని ఇంటర్‌సిటీ రైలులో తనిఖీ చేస్తుండగా రంజిత్‌కుమార్ సాహూ, నిశాంత్ కుమార్ మండల్, జైలో మండల్, ఉదయ్‌కుమార్ మండల్, అస్‌కుమార్ యాదవ్ అనే వారు పారిపోయేందుకు ప్రయత్నించారు. దీంతో క్రైమ్ టీం చాకచక్యంగా వారిని పట్టుకుని పలాస జీఆర్పీ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు అనంతరం ఎస్‌ఐ షేక్ షరీఫ్ విచారణ జరిపి వారిపై కేసు నమోదు చేశారు. విచారణలో పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి. వీరు బీహార్‌కు చెందిన దొంగల ముఠా సభ్యులని తెలిసింది. ఇది వరకు రెండు కేసుల్లో 27 గ్రాముల బంగారం, 5 తులాల వెండి(రూ.99 వేలు) స్వాధీనం చేసుకొని విశాఖపట్నం రైల్వే కోర్టులో హాజరుపరిచిఉన్నారు. నెల రోజుల కిందట కూడా వీరి వద్ద నుంచి 50 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నారు. వీరు ఎక్కువగా రైళ్లలో బ్యాగులను ఎత్తుకెళ్లడం, జిప్‌లు తీసి సామాన్లు దోచుకెళ్లడం చేస్తుంటారు. బబ్లు, డబ్బా అనే రెండు బీహార్ అంతర్‌రాష్ట్ర ముఠాలకు చెందిన వీరిని పట్టుకోవడంపై ఉన్నతాధికారులు అభినందించారు. నెల రోజుల వ్యవధిలో ఇలాంటి గ్యాంగుల వద్ద నుంచి పలాస జీఆర్పీ సిబ్బంది రూ.3,39,000 విలువ కలిగిన బంగారం స్వాధీనం చేసుకున్నారు.

శ్యాంపురియా మృతి తీరని లోటు



అంత్యక్రియల్లో పాల్గొన్న పిరియా సాయిరాజ్, కడియాల ప్రకాష్

కవిటి: జిల్లా బెంతొ ఒడియా సంఘం మాజీ అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్యాంసుందరపురియా(71)మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. శ్యాంపురియా శుక్రవారం వేకువజామున పాతవరకలోని తన నివాసంలో అనారోగ్యంతో మృతిచెందారు. మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఎన్నో సేవలందించి ఎందరో యువకుల్ని రాజకీయాల్లోకి తీసుకువచ్చిన నేతగా గుర్తింపు పొందారు. ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి సుదీర్ఘకాలం రాజకీయాల్లో రాణించి పలు పదవుల్ని చేపట్టారు. పిరియా సాయిరాజ్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

బైక్ పైనుంచి జారిపడి మహిళ మృతి



మృతి చెందిన సరోజిని

నందిగాం: మండలంలోని పెంటూరుకు చెందిన కూర్మాపు సరోజిని(48) బైక్ పైనుంచి జారిపడి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సరోజిని కుమారుడు రమేష్‌కు ఈ నెల 24న వివాహం నిశ్చయించారు. కుమారుడితో కలిసి పెళ్లి సామగ్రి కొని తిరిగి వస్తుండగా కొత్తగ్రహారం వద్ద బైక్‌పై వెనుక కూర్చున్న సరోజిని ఒక్కసారిగా జారి పడింది. తలకు బలమైన గాయం కావడంతో టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించగా కొద్ది సేపటికే మృతి చెందింది. సరోజిని సోదరుడు వసంతరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నందిగాం ఎస్సై మహమ్మద్ అమీర్ అలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరాలి

ఎచ్చెర్ల క్యాంపస్: కేంద్ర యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ గుర్తించిన హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో విద్యార్థులు చేరాలని ఏపీ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర అధ్యక్షుడు రాజగిరి హరివిఠల్, రాష్ట్ర కార్యదర్శి దుంపల వెంకట అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజినిని మర్యాద పూర్వకంగా కలిశారు. వర్సిటీ విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరేలా ప్రోత్సహించాలని కోరారు. దీని వల్ల వ్యక్తిగత క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, కమ్యూనికేషన్ స్కిల్స్, యోగా, మెడిటేషన్ వంటివి నేర్చుకుంటారని, మెరుగైన జీవన విధానం అలవడుతుందని చెప్పారు.

విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తాం



మాట్లాడుతున్న ధర్మాన ప్రసాదరావు

- విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో మంత్రి ధర్మాన

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వైఎస్సార్‌సీపీ ఎన్నికల్లో గెలిచాక విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తామని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం రాత్రి విశ్రాంత ఉద్యోగుల ఆత్మీయ అభినందన సభను నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చంద్రబాబునాయుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకోవడానికి తన తాబేదారులను ధనవంతులు చేయడానికే అమరావతి వైపు మొగ్గు చూపుతున్నారని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో అభివృద్ధి అంతా హైదరాబాద్‌లో చేయడం వల్లే తెలంగాణ ఉద్యమం వచ్చి రాష్ట్ర విభజనకు కారణమైందన్నారు. ఇప్పుడు అమరావతి ఒక్క ప్రాంతాన్నే రాజధానిగా చేస్తే మరో 70 ఏళ్లు వెనక్కి వెళ్లిపోవాల్సి వస్తుందన్నారు. నిపుణుల కమిటీ సిఫార్సులను తుంగలో తొక్కి చీకటి జీఓలతో అమరావతిని సింగపూర్ కంపెనీలకు కారుచౌకగా చంద్రబాబు అప్పగించారని తెలిపారు. సదుపాయాలు అందుకోవడంలో ప్రజలకు గౌరవం దక్కినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం అవుతుందన్నారు. అలాకాకుండా జన్మభూమి కమిటీల చుట్టూ తిరుగుతూ వారి సేవ చేసే వారికి పథకాలు అందిస్తే అది గౌరవం కాదన్నారు. సమాజంలో అంతరాలను తొలగించడం ఒక్క విద్యతోనే సాధ్యపడుతుందని బలంగా నమ్మిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. 75 ఏళ్ల పాటు పాలించిన నాయకులంతా విద్యావ్యవస్థపై దృష్టి సారించకపోవడం వల్లే సమాజం అభివృద్ధి చెందకుండా అలా ఉండిపోయిందన్నారు. విశ్రాంత ఉద్యోగులంటే విజ్ఞులని, మీరు సామాన్య ప్రజల్ని ప్రభావితం చేయగలని, ప్రజలకు మేలుచేసే ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఎంపీగా పేరాడ తిలక్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో శ్రీశయన కార్పొరేషన్ చైర్మన్ డి.పి దేవ్, కాళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రౌతు శంకరరావు, విశ్రాంత ఉద్యోగులు రాడ కైలాశ్వరరావు, పోలుమహంతి ఉమామహేశ్వరరావు, బుక్కూరు ఉమామహేశ్వరరావు, సురంగి మోహనరావు, త్రిపురాన వెంకటరత్నం, వావిలాపల్లి జగన్నాథం నాయుడు, పోలినాయుడు, నాయక్, రామకృష్ణ, ఊడి శ్యామ్, నిక్కు అప్పన్న, విజయ్‌భాస్కర్, డాక్టర్ శ్రీనివాస పట్నాయక్, వెంకటరమణ, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..



ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ వార్షిక కల్యాణం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సూర్యనారాయణ స్వామి, ఉషా, పద్మిని, ఛాయా దేవేరుల కల్యాణాన్ని ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అరసవల్లి

టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరి..



పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ధర్మాన కృష్ణదాస్



బీజేపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పిరియా సాయిరాజ్



ఎం.అవలంగి గ్రామస్తులకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పార్టీలో చేరిన వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసిన మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్

జలుమూరు: సంక్షేమమే పరమావధిగా సీఎం జగన్ అమలు చేస్తున్న పథకాలే మళ్లీ ముఖ్యమంత్రిగా చేస్తాయని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. శుక్రవారం జలుమూరు మండలం సుబ్రహ్మణ్యపురం, యడ్లవానిపేట, మామిడిపేట గ్రామాలకు చెందిన 230 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. వీరికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ చేరిన వారిలో వై.భూలోకం(ఉప సర్పంచ్), గొల్లంగి పాపారావు, కె.కసవయ్య(వార్డు మెంబర్లు), వై.ఎర్రన్న, కె.సింహాచలం, ఎస్.సుబ్బారావు, కె.రామారావు, ఎస్.రాము, వై.కృష్ణారావు, కె.శ్రీరామూర్తి, ఎం.రామారావు, వై.సత్యం, ఎం.శ్రీనివాసులు, చంద్రరావు, ఎం.కర్రన్న తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బీసీ జోనల్ ఇన్‌చార్జి, పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, ధర్మాన రామలింగంనాయుడు, ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు కనుసు సీతారాం, మండల సలహాదారు పైడి విఠలరావు, సర్పంచ్ కూన రమణ, అల్లాడ, చల్లవానిపేట పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామలరావు, పి.రాజప్పల నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.వి.రమణి, పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు దామ మన్మథరావు, ఎంపీటీసీ సుందరరావు పాల్గొన్నారు.

పాతపట్నం : హిరమండలం మండలంలోని ఎం.అవలంగి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం పాతపట్నంలోని ఎమ్మెల్యే రెడ్డి శాంతి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ఉప సర్పంచ్ పడాల జగదీశ్వరరావు, కొటారి భుజంగరావు, కొటారి భాస్కరరావు, ఇప్పలి రాములు, నెర్లి కేశవ, పడాల రాము, దమ్మల చిన్నారావు, మేకల తులసీ, లావేటి చిన్నప్పన్న, కుప్పిలి భాస్కరరావు, లావేటి ఈశ్వరరావు తదితర 60 కుటుంబాలు వారు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎ.వి.సురేష్, నాయకుడు వంగపల్లి చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డు బెల్లుపడ కాలనీకి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బంగారు ధనుంజయరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బోర తులసయ్యతో పాటు 100 మంది కార్యకర్తలు శుక్రవారం మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఎంపీపీ బోర పుష్ప, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి, ప్రచార విభాగ కమిటీ జిల్లా అధ్యక్షులు ఆదిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, జేసీఎస్ అధ్యక్షుడు సాలిన ఢిల్లి, వార్డు కౌన్సిలర్లు జి.ప్రదీప్, ప్రేమ్‌కుమార్, మధుమూర్తి, జగన్, పార్టీ నాయకులు పిలక సంతు, కాల్ల సత్యం, చాట్ల తులసీదాస్, నీలాపు డిల్లి, ఆశి పురుషోత్తం, దిలీప్, లాభాల శంకర్, రెయ్యి నారాయణ,తేజ, కిరణ్‌బెహర, లోకనాథం, యాదవరెడ్డి పాల్గొన్నారు.

కవిటి: వైఎస్సార్ సీపీతోనే సామాజిక న్యాయం జరుగుతుందని వక్తలు అన్నారు. శుక్రవారం రాత్రి కవిటి మండలం బసవకొత్తూరు, కంచిలి మండలం బసవపుట్టుగ గ్రామాలకు చెందిన 500 కుటుంబాల వారు మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల తమ గ్రామాలకు ఎన్నికల ప్రచారానికి వచ్చిన టీడీపీ నేతలు మాయమాటలు చెప్పి తమకు ఇష్టం లేకున్నా తెలుగుదేశం కండువాలు కప్పి మోసంచేశారన్నారు. తమ ప్రయాణం ఎప్పటికీ సీఎం జగన్‌తోనే అని ప్రకటించారు. పార్టీలో చేరిన వారిలో పి. భుజంగరావు, మాజీ ఎంపీటీసీ బసవ హరిబంధు, బి.భాస్కరరావు, బి.తేజం, జానకిరావు, కర్రి బసవ చిన్నబాబు, వార్డు సభ్యుడు పద్మనాభం, తిప్పన ఉమాపతి, తిప్పన జగన్నాయకులు, బసవర పూర్ణారావు, కోట కుమారస్వామి, బసవ జానకిరావు, కప్ప మన్మథరావు, ఎస్.శంకర్, బి.భీమారావు, బి.కామేష్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సీనియర్ నేతలు మద్దిలి ఈశ్వరరావు, పలికల జయరాం, దూపాన నేతాజీ తదితరులు పాల్గొన్నారు.